

# బ్రతుకు కన్నా గొప్పది!

జీడిగుంట రామచంద్రమూర్తి

హైదరాబాద్ నీళ్లు బాగా ఆకలి పుట్టిస్తాయని చాలామంది చెబుతుంటారు. హైదరాబాద్ వాతావరణం చాలా ఆహ్లాదాన్ని కలిగిస్తుందని కూడా మరికొంతమంది అంటుంటారు...

అందులో అబద్ధం లేదని చాలాసార్లు

బస్సులకోసం బస్‌స్టాపులో వెయిట్ చేయవలసి వచ్చినప్పుడు మాత్రం – 'ఇంకెప్పుడూ హైదరాబాద్ రాకూడదనీ, వచ్చినా సిటీబస్ ఎక్కటానికి ప్రయత్నించకూడదనీ – ఒట్టేసుకోవాలన్నంత కోపం వస్తుంది...

'నువ్వెక్కవలసిన రైలు ఓ జీవితకాలం లేటు' – అని ఎవరో కవిగారు అన్నట్లు –

'మనం ఎదురుచూసే బస్సు ఈ జీవితకాలంలో రాదు –' అని అనుకోవాల్సిన పరిస్థితి వస్తూంటూంది. ఒకోసారి...

మనకు కావలసిన బస్సు ఒకవేళ వచ్చెనుపో – సరిగ్గా స్టేజిలో ఆగక పోవచ్చు... ఆగెనుపో – మనం ఎక్కే వరకూ ఓపిగ్గా అది అక్కడ నిలబడక పోవచ్చు !... నిలబడెనుపో – మనం ఎక్కటానికి ఫుట్‌బోర్డు మీద కూడా చోటు దొరక్కపోవచ్చు...!

అప్పుడు హాయిగా 'పోతేపోనీపోరా'– అని స్వగతంలో పాడుకుంటూ, మళ్లీ అక్కడే నిలబడి మరో బస్సుకోసం తపస్సు ప్రారంభించేసే పరిస్థితి రావచ్చు...!

సరిగ్గా ఆ రోజు సాయంత్రం ఆరు గంటలవుతున్న వేళ, నేను అలాగే తపస్సు చేస్తున్నాను సిటీబస్సుకోసం !

అంతకు రెండురోజుల ముందునుంచీ అడపాదడపా జల్లులు పడవచ్చుననీ, ఆకాశవాణివారు వీలున్నప్పుడల్లా చెబుతున్నారని కాబోలు – అంతవరకూ నిర్మలంగావున్నా – ఇంక బాగుండదని మొహమాటపడిన ఆకాశం, ఆకాశవాణికీ తనకూ వున్న అవినాభావ సంబంధాన్ని పురస్కరించుకుని – నల్లమబ్బులతో నిండిపోయి, రోడ్డుమీదపోయే జనాన్ని హడలగొట్టి పారేస్తోంది...

ప్రత్యక్షంకాని దేవుడికోసం పట్టుదలగా తపస్సుచేసే మునీశ్వరుడిలా, ఆ బస్‌స్టాప్ దగ్గరి చెట్టుక్రింద నిలబడి – అసలు వస్తుందో రాదో తెలియని సిటీబస్సుకోసం దూరంగా దృష్టినిసారించి చూస్తున్నాను.

అంతవరకూ ఆ స్టాప్‌లోనే నిలబడి వున్న అయిదుగురు మనుషులూ, వాళ్ళ వాళ్ళ మనసుల్లో ఎలాంటి మంచి నిర్ణయాలు తీసుకున్నారో తెలియదుకానీ ఇద్దరూ, తర్వాత మరో ముగ్గురూ నడుచుకుంటూనే వెళ్ళిపోయారు...

నాకూ అసహనంగానే వుంది... నడిచి వెళ్ళిపోదామంటే తరిగే దూరం కాదు...రిక్షా ఎక్కితే-గమ్యం చేరుకునే లోగానే దారిలో వర్షం మొత్తేసంగతి అటుంచి, నడుం పడిపోయేలా అందులో ఒంగిపోయి, ఒదిగిపోయి రెండుగంట లయినా కూర్చోవాలి...ఆటో ఎక్కుదామంటే ఆత్రూపాయల ఛార్జీ...! అంటే హైదరాబాదులో రెండుపూటల భోజనం.

ఏంచెస్తాం మరి ? పొరుగూరునుంచి సిటీకి వచ్చినప్పుడు ఇలాంటివన్నీ లెఖ్ఖ చూసుకోవాల్సిందే !

రాంనగర్‌లో ఎక్కడో మారుమూల అన్నయ్యా, వదినా వుంటున్నారు... ఏడాదికి రెండుసార్లైనా స్పాట్‌వేల్యుయేషన్ కోసమో - మరో పనిమీదనో హైదరాబాద్ రాక తప్పదు...వచ్చినప్పుడు అన్నయ్య యింట్లో వుండకుండా ఏ హోటల్లోనో వుంటే ఎలా?... అసలు ఎలా వుండగలం ??

పగలంతా ఎలా తిరిగినా, ఏ హోటల్లో భోంచేసినా-రాత్రికి మాత్రం అన్నయ్యగారింటికి చేరుకోవాల్సిందే!...

రిస్ట్‌వాచ్‌లోకి చూసుకున్నాను... ఆరూ పది !... సంధ్య వెలుగులమీద చీకటితెరలు ఇంకా పూర్తిగా వాలిపోలేదు... క్షణక్షణానికి నాలోని ఓపిక తగ్గిపోతోంది ... ఖాళీగా ఆటోరిక్షా కనిపిస్తే ఆపుజేసి ఎక్కేయా లనుకున్నాను...

సరిగ్గా అప్పుడే, మరోవ్యక్తి అక్కడకువచ్చి, నాకు దగ్గరలోనే నిలబడ్డాడు. అతనుకూడా ఏదో బస్సు కోసమే ఎదురుచూస్తున్నాడు.

ఒకటి రెండుసార్లు అప్రయత్నంగానే అతనివైపు చూశాను. అంతకుముందు కూడా అతన్ని ఎక్కడో చూసినట్టు అనిపించింది. ఎక్కడ చూశానో, ఎప్పుడు చూశానో జ్ఞాపకం తెచ్చుకోవటానికి తీవ్రంగా ప్రయత్నించాను...నా ఆలోచన ఫలించింది. అత నెవరో గుర్తుకొచ్చింది...

సరిగ్గా నాలుగు నెలల క్రితం...

కథలపుస్తకం వేయించాలని హైదరాబాద్ వచ్చాను... ప్రెస్సులో పనిచూసుకుని ఇలాగే చీకటిపడుతున్న సమయంలో ఈ బస్ స్టాపులోనే నిలబడ్డాను. సాధారణంగా ఈ స్టాప్‌లో ఎప్పుడూ జనం ఎక్కువగా వుండరు కాబోలు, ఆ రోజుకూడా ఇలాగే ఒకరో ఇద్దరో షెల్టర్ క్రిందనున్న సిమెంటు బెంచీమీద కూర్చుని వున్నారు...

అంతలోనే అతను నా దగ్గరగా వచ్చాడు.

"టైమెంతయింది సార్?" అడిగాడు.

చెప్పాను.

ఆ మాటా ఈ మాటా అయ్యాక - నా పేరూ ఊరూ తెలుసుకున్నాడు...

"ఏదైనా పనిమీద వచ్చారా?" - అడిగాడు ఆ తర్వాత.

"ఔను ! ప్రెస్సు పనిమీద వచ్చాను !"

"అదిగో ! అటువైపు చూశారా ?"— రెండు క్షణాలుపోయాక - అక్కడకు కొంచెం దూరంలోవున్న చెట్టువైపు చూపిస్తూ - నెమ్మదిగా అడిగాడు.

ఆ చెట్టుక్రింద ఓ యువతి నిలబడి వుంది.

"కావాలంటే చెప్పండి !... యాభై

రూపాయలు" – వెంటనే అన్నాడు అతను ... విషయం అర్థమయి పోయింది.

ఇలాంటి నగరాల్లో – అలా జీవించే వాళ్లకూడా చాలామంది వుంటారని నాకు తెలుసు... ఏవేవో ప్రత్యేకమయిన కారణాలవల్లనే కొందరు అలాంటి జీవితాలకు బానిసలయిపోతారనీ – కొన్ని కొన్ని విచిత్రమైన సంఘటనలు వారిని ఈ పాపకూపంలోకి లాగేస్తాయనీ ఒకరిద్దరు మిత్రులు చెప్పగా విన్నాను.

అలాంటివారి జీవితాన్ని యధాతథంగా చిత్రించే వాస్తవిక నవల రాయాలని నేను చాలాకాలంగా అనుకుంటున్నాను...

ఆ అమ్మాయి విషయంలో కూడా ఏదైనా బలవత్తరమైన సంఘటన జరిగేవుండాలి! ఆ సంఘటనే ఆమెను ఈ స్థితికి తీసుకొచ్చి వుండాలి...

కనీసం ఆమె జీవితాన్ని తెలుసుకోవటానికైనా నేను ఆ బేరానికి ఒప్పుకోవాలి. తెలుసుకుని చేసేదీ, చేయగలిగిందీ ఏమీ వుండదు. ఏమైనా ఆసక్తిని కలిగించే విషయాలు దొరికితే– వాటిని ఆధారంగా తీసుకొని – ఓ నవల రాయచ్చు...

ఆ స్వార్థంతోటే అతను చెప్పిన బేరానికి ఒప్పుకున్నాను.

"అయితే వుండండి !... నేను మాట్లాడి వస్తాను !" – అంటూ అతను ఆమె దగ్గరకు వెళ్ళాడు. రెండు నిముషాలు వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఆమె తన చేతికున్న రిస్ట్‌వాచ్‌లోకి చూసుకుంది.

అతను తిరిగివచ్చి –

"సరిగ్గా మరో పది నిముషాలకు ఆ అమ్మాయి బయల్దేరుతుంది ... మీరు ఆమెతో వెళ్ళండి !"– అన్నాడు.

"ఎక్కడికి ?"–

"తన యింటికి తీసుకెళుతుంది... ఆ అమ్మాయి మొగుడు ఏదో ఫాక్టరీలో పనిచేస్తున్నాడు. నైట్ షిఫ్ట్‌కి వెళ్ళిపోయాడు. తెల్లారేదాకా రాడు." గబగబా చెప్పేశాడు...

నేను ఆశ్చర్యపోయాను... పెళ్లయిన ఓ ఆడకూతురు, భర్త ఇంట్లో లేకుండా చూసి ఇలాంటి గ్రంథం నడుపుతోందంటే – ఇదేదో ఇంటరెస్టింగ్ కేసే' అనుకున్నాను. 'ఇంతకీ ఇతనెవరో ?'– అనే ఆలోచన కూడా కలిగింది...

"నాకు ఓ ట్వంటీ రుపీస్ ఇవ్వండి ! తక్కిన ముప్పై, తర్వాత ఆమెకు ఇవ్వచ్చు !"– అన్నాడు అతను

నా ఆలోచనలు అక్కడితో తెగిపోయాయి.

వెంటనే పాంటుజేబులోంచి ఇరవై రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాను.

"థాంక్యూ సర్ ! విష్‌యూ ఆల్

ది బెస్ట్!"- అంటూ చిన్నగా నవ్వేసి అతను అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

నేను మళ్ళీ, ఆ అమ్మాయి గురించీ, ఆమె చెప్పబోయే విషయాల గురించీ, - నేను రాయబోయే నవల గురించీ ఆలోచిస్తూ నిముష నిముషానికీ - ఆమె వైపు చూస్తూ నిలబడ్డాను ... రెండు మూడుసార్లు ఆమె కూడా నావైపు చూడటం గమనించాను...

.........మూడు ... అయిదు... ఆరు...పది...

అలా పదిహేనునిముషాలు గడిచి పోయాయి. అయినా ఆమె బయలు దేరలేదు. నాకు కొంచెం అనుమానం వచ్చింది. మరో పదినిముషాలు చూసి, నెమ్మదిగా ఆమె దగ్గరకు నడిచాను.

ఆమె తన చూపుల్ని మరోవైపు మరల్చుకుంది. నాకు మహా చెడ్డ ఇబ్బందిగా వుంది...

"బయలుదేరుదామా ?" - ఎలాగో ధైర్యంచేసి అడిగేశాను. ఒక్కసారిగా ఆమె - కళ్ళెర్రచేసినట్టుగా - నావైపు చూసింది. చెప్పద్దూ, ఖంగారెత్తి పోయింది నాకు...అయినా పైకి ఏమీ కనిపించనీయకుండా -

"మీరు పదినిముషాల్లో బయలు దేరుతారని అతను చెప్పాడు-" అన్నాను నీళ్ళు నములుతూ.

"ఎవరతను ?" గద్దించినట్టుగా అడిగింది.

తెల్లబోయాను...

"ఇందాకటినుంచీ మిమ్మల్ని - మీ దొంగచూపుల్ని నేను గమనిస్తూనే వున్నాను. పిచ్చి పిచ్చి వేశాలు వేశా రంటే గట్టిగా అరిచి, నలుగుర్ని పిలుస్తాను. మీలాంటివాళ్లకు అప్పుడు గానీ బుద్ధిరాదు...ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలు, వేషాలు వేస్తారు, వేశాలు !"-మళ్ళీ అంది ఆ అమ్మాయి.

కేసర్థమయింది నాకు... అయినా ఆమెకు విషయమంతా చెప్పి - అందులో నా తప్పేమీలేదని ఋజువుచేసుకోవా లనిపించింది...అందుకే జరిగినదంతా ఆమెతో చెప్పాను. అతనికి ఇరవై రూపాయలు ఇచ్చిన సంగతి కూడా చెప్పాను.

"అతనెవరో మిమ్మల్ని ఛీట్, చేశాడు -" తేల్చేసింది ఆమె

"మరి అతను మీ దగ్గర కొచ్చి మీతో మాట్లాడాడుకదా ?" - అది పిచ్చి ప్రశ్న ... ఆ సంగతి నాకూ తెలుసు !... ఆ అమ్మాయీ అలాగే అంది.

"మీరు చాలా పిచ్చివారులా వున్నారు అతను నాతో ఏం మాట్లాడాడో తెలుసు కోకుండా అతనికి డబ్బెందు కిచ్చారు ?.. అయినా అతను నా దగ్గర కొచ్చి, నా పేరేమిటని? అడిగాడు నేను చెప్పాను - నన్ను చూసి వాళ్ళ క్లాస్‌మేట్‌నేమోనని భ్రమపడ్డాడట...ఆ తర్వాత పైమెంత

యింది అని అడిగాడు. నేను చెప్పాను...అంతే..." - ఆమె అలా చెప్తూంటే, నా చెంపలు రెండూ నేనే వాయించుకోవాలన్నంత ఆవేశం వచ్చింది.

ఆమెకు 'సారీ' చెప్పి - బస్‌కోసం మరి చూడకుండా, అక్కడినుంచి వెళ్ళిపోయాను ఆ రోజు.

మళ్ళీ నాలుగునెలల తర్వాత -

ఈరోజు...ఇక్కడ...

అతను !!

అతనే !... అనుమానం లేదు. దూరంగా ఆ చెట్టుక్రింద అమ్మాయి కూడా వుందేమోనని చూశాను ... కనిపించలేదు.

అతన్ని విడిచిపెట్టకూడ దనిపించింది. సమాజాన్ని ఛీట్ చేయడంకంటే ఆ సమాజంలో అడుక్కుని తినటం మంచి దని అతనికి సలహా ఇవ్వాలన్నంత కోపం వచ్చింది...

"మిస్టర్...మాట !" - పిలిచాను.

అతను దగ్గరగా వచ్చాడు.

"నే నెవరినో గుర్తున్నానా ?" - అడిగాను.

"మిమ్మల్ని ఎక్కడో చూశాను... కానీ గుర్తురావటంలేదు-" రెండుక్షణాలు నావైపు పరిశీలనగా చూసి, అన్నాడు.

"అవును ! ఎలా గుర్తుంటాను ? నాలాంటివాళ్ళు చాలామంది నీకు తగిలి వుంటారు...అందర్నీ గుర్తుపెట్టుకోవటం అంత సులువు కాదుగా !... అయినా నువ్ మాత్రం అందరికీ గుర్తుంటావ్ ? అది మాత్రం మర్చిపోమ్..." - నా కోపాన్నీ, ఆవేశాన్ని గమనించి అతను ఓ అడుగు వెనక్కివేశాడు. ఆ తర్వాత తప్పుచేసినవానిలా తలదించుకున్నాడు.

"సరిగ్గా నాలుగునెలల క్రితం ఇదే బస్‌స్టాప్‌లో నన్ను మోసంచేసి, ఇరవై రూపాయలు పట్టుకుపోయావ్... గుర్తొచ్చిందా ?... అయినా అలా మోసం చేసేబదులు - నలుగుర్నీ నాలుగు రూపాయలు అడుక్కునివుంటే బాగుండి పోయేది !" - అతని కాలరు పట్టుకుని కుదుపుతూ అన్నాను.

అప్పుడే చూశాను అతని కళ్ళల్లోకి.. ఆ కళ్లల్లో - నిండా నీళ్లు !...

ఇంకా ఎన్నో అనేసి అక్కసు తీర్చుకోవాలనుకున్న నా ప్రయత్నాన్ని అతని కన్నీళ్లు ఆపేశాయి.


అతడు తటాలున నా రెండుచేతులూ పట్టుకుని -

"నన్ను క్షమించండి మాస్టారూ !" అన్నాడు.

విడిలించుకోబోతున్న చేతుల్ని గట్టిగా పట్టుకుని -

"మీ రొక్కసారి మా యింటికి రావాలి మాస్టారూ !... ఈ ప్రక్క సందులోనే మా ఇల్లు" - అన్నాడు.

అతను అలా ఎందుకు అడుగుతున్నాడో అర్థంకాలేదు. 'ఒకవేళ,




ఆనాడు తాను తీసుకున్న ఇరవై రూపాయలూ తిరిగి ఇచ్చేస్తాడేమో' అని కూడా అనిపించింది.

"మీరు ఆలోచించొద్దు ! ఒక్కసారి రావాలి! ...మళ్ళీ వెంటనే మీరు తిరిగి వచ్చేయొచ్చు !... ప్లీజ్ !" - అతను అలా అర్థింపుగా రెట్టించి అడగటంతో కాదనలేక అనుసరించాను.

మరో అయిదు నిమిషాల్లో అతని ఇంటికి చేరుకున్నాం.

ఒక్కటే గది. ఆ గదిలో ఓ మూల ప్లాస్టిక్కు బకెట్ ఒకటీ - సిల్వర్ చెంబూ ఉన్నాయి. మరోపక్కన నీళ్ళ కూజా !...గదిలో అడ్డంగా కట్టిన తాడు మీదమాసిపోయిన బట్టలు అస్తవ్యస్తంగా పడిఉన్నాయి.

లోపలకు వెళ్ళగానే - మూలనున్న చాప తీసి పరిచాడు.

"ఇది చూడండి!" - షెల్ఫులో వున్న పుస్తకంలోంచి, ఫోటో ఒకటితీసి నేను చాపమీద కూర్చున్న తరువాత - నాకు అందించాడు.

ఆ ఫోటోలో అతనూ ... అతని ప్రక్కనే ఆమె !... క్షణంసేపు నేను ఆశ్చర్యపోయాను.

"అండీ...!"

మీరు ఆ రోజున చూసింది ఈమెనే! అండీ నా భార్య !!" -

అర్థంకానివాడిలా అయోమయంగా చూశాను అతనివైపు... అతని కళ్ళల్లో కనిపిస్తున్న విషాదం - అతని గొంతులో కూడా వినిపించసాగింది...

"మాది బెజవాడ...నేనూ శాంతీ ప్రేమించుకున్నాం...కానీ మా పెళ్ళికి పెద్దవాళ్లు ఒప్పుకోలేదు. కులాలు సరిపోవంటూ మా ఇద్దర్నీ హద్దుల్లో పెట్టాలని ప్రయత్నించారు...కానీ మేం ధైర్యంగా పెద్దవాళ్ళను ఎదిరించాం... ఇక్కడకు వచ్చి పెళ్ళిచేసుకున్నాం... డిగ్రీ లేకపోయినా – నేను చదివిన చదువుకు తగిన వుద్యోగం, ఏదో ఒకటి దొరక్కపోదనే ధీమాతో – రెండు మూడు నెలలు – కాళ్ళకు బలపాలు కట్టుకొని తిరిగాను. ప్రయోజనం లేక పోయింది...నా శాంతిని నేను పోషించు కోవాలనే పట్టుదలతో – కొన్నాళ్ళు రోజుకూలీమీద కూడా పనిచేసాను... అదీ ఓ రోజుంటే నాలుగురోజులుండేది కాదు...అందరికి...ఉపాయంతట్టింది. కొంతమంది మనుషుల్లో వుండే అలాంటి బలహీనతను వాడుకుని – డబ్బు సంపా దించాలని నిర్ణయించుకున్నాను ... ముందు శాంతి ఒప్పుకోలేదు...కానీ ఆకలీ, అవసరమూ ఎలాంటి పనినైనా చేయిస్తాయేమో !..." అతను చెప్పటం ఆపి నిట్టూర్చాడు.

"ఆ రోజున నేను కాబట్టి సరిపో యింది ... మరెవరయినా రౌడీలాంటి మనిషయితే – ఏంచేసేవాడో ?" –

"మీరన్నది నిజమే !... అందుకే అలాంటివారి జోలికి వెళ్లేవాళ్ళమేకాము ! కాస్త మెత్తగా కనిపించేవారిదగ్గరా – పొరుగూరివాళ్ళదగ్గరా – అప్పుడప్పుడు ఈ నాటకం ఆడేవాళ్ళం !" – అన్నా డతను.

"కానీ ఎంతకాలమని అలా మోసం చేయగలుగుతారు ?... ఎప్పుడో ఒక ప్పుడు మోసం బయటపడుతుంది !... ముందు మెతగ్గా కనిపించిన మనిషే – మోసపోతున్నట్లు తెలుసుకుంటే – ఆ ఆవేశంలో ఎంతకయినా తెగిస్తాడు" – నేనింకా ఏదో చెప్పబోతున్నాను.

నా మాటలకు అడ్డంవస్తూ – అతను అన్నాడు.

"నిజమే మాస్టారూ ! ఎల్లకాలం, మోసంచేస్తూనే బ్రతికేయాలనుకోవటం ఆత్మవంచనే అవుతుంది ! నా విషయం లోనూ అలాగే జరిగింది !" – అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది...

ఆ జరిగిందేమిటో తెలుసుకోవాలనే ఆతృత నాలో ఎక్కువ అవుతోంది.

"ఏం జరిగింది ?" – అని అడిగాను.

"ఆ రోజున మిమ్మల్ని నమ్మించి ఇరవై రూపాయలు తీసుకున్నట్టుగానే ఇవాల్టికి పదిహేనురోజుల క్రితం – ఓ బస్‌స్టాప్‌లో ఒకాయన్ని బుట్టలో వేశాను. ఇరవై రూపాయలూ తీసుకుని నేను వెళ్ళిపోయాను. ఆ తర్వాత..." అతనుమరి చెప్పలేకపోయాడు. పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవాలని విఫల ప్రయత్నం చేస్తున్నాడు.

"అప్పుడేమయింది ? అతను ఏదైనా అల్లరిచేశాడా ?" - అడిగాను

తన మునివేళ్ళతో కళ్ళు తుడుచుకుని జేబులోంచి మడతలుపడి నలిగిపోయిన ఓ కాగితాన్ని తీసి, నా చేతికి అందించాడు.

ఆత్రుతగా దాన్ని విప్పి చదివాను.

"......మీరు వాడి దగ్గర ఇరవై రూపాయలు తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత పదినిముషాలకు వాడు నా దగ్గరకొచ్చి గొడవచేశాడు. నేను ఎప్పటిలాగనే - దబాయించి మాట్లాడాను. వాడ్ని అల్లరిపెట్టాలని చూశాను. నా కేకలకు, చుట్టూ జనం మూగారు. వాళ్లందరితోటీ, నేను వాడి పెళ్ళాన్ననీ, నాకు మతి స్థిమితంలేక మాట్లాడుతున్నాననీ-కల్పించి చెప్పాడు. ఖాళీగాపోతున్న ఆటోరిక్షాను పిలిచి, బలవంతంగా నన్ను అందులోకి తోశాడు. ఆ రాక్షసుడి బారినుంచి ఎలాగో తప్పించుకుని ఇంటి కొచ్చిపడ్డాను...

"కానీ ఈ బ్రతుకు నేనింక బ్రతక లేనని ఓ నిర్ణయానికి వచ్చాను !... బ్రతకాలంటే ఎన్నో మార్గాలున్నాయని మీరు అప్పుడప్పుడు అంటూండేవారు. కానీ బ్రతుకుకన్నా మనసే గొప్పదని నాకు అనిపిస్తోంది...ఆ మనసు గాయపడితే - భరించి బ్రతకటం కష్టం !... అందుకే ఈ బ్రతుకును చాలిస్తున్నాను. నన్ను క్షమించండి...

...శాంతి" -

అలా వుత్తరంలోకి చూస్తూనే వుండిపోయాను...

"నా శాంతి చచ్చిపోయింది మాస్టారూ ! ఆ రాత్రి తొమ్మిదింటికి - మామూలుగా నేను ఇంటికి తిరిగొచ్చే సరికి - ఈ గదిలోనే ఆ మూల -ఒంటి మీద కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకుని - నికృష్టంగా చచ్చిపడివున్న నా శాంతి నాకు కనిపించింది... అంతే మాస్టారూ !..." - అతను ఏడుస్తూ ఇంకా ఏమిటో చెబుతున్నాడు...

అక్కడ మరి వుండలేక - వికలమయిన మనసుతో వెనక్కి తిరిగి వచ్చేశాను...

